## రాజీ మార్గంతో సత్వరమే న్యాయ పరిష్కారం



**సింగరాయకొండ, జూలై 5,ప్రభాతవార్త**

రాజీ మార్గంతోనే సత్వరమే న్యాయ పరిష్కారం లభిస్తుందని, కేసులు తక్షిణ పరిష్కరానికి లోక్ అదలాత్ ఉత్తమ వేదికగా భావించాలని జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు అన్నారు.దేశవ్యాప్తంగా న్యాయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అధాలత్‌లో భాగంగా శనివారం సింగరాయకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వద్ద లోక్ అధాలత్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటుతో సివిల్, ఫ్యామిలీ, పబ్లిక్ యుటిలిటీ వంటి వివిధ అంశాలకు సంబంధించిన కేసులు రాజీ ద్వారా పరిష్కరించారు.ఈ కార్యక్రమానికి సింగరాయకొండ జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు ముఖ్య అతిధిగా హాజరైనారు. ఈ సందర్భంగా జడ్జి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజీ చేయదగిన కేసుల పరిష్కారం కోసం లోక్ ఆధాలత్ మహత్తరమైన అవకాశాన్ని అందిస్తోందని అన్నారు.లోక్ అదాలత్ లో ఇరుపక్షలు కేసును రాజీ చేసుకుంటే శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఇక్కడ పరిష్కరించిన కేసులపై మళ్లీ అప్పీల్‌కు అవకాశం ఉండదు కనుక ప్రజలు దీనిని నమ్మకంగాఅంగీకరించాలని సూచించారు.ఈ సందర్భంగా బార్అసోసియేషన్ అధ్యక్షుడు సన్నిబోయిన శ్రీనివాసులు మాట్లాడుతూ,కొండెపి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. న్యాయపరమైన వివాదాలను కోర్టుల్లో ఏళ్ల తరబడి నడిపించడం కన్నా, ఒకసారి రాజీకి వస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందని గుర్తించాలని అన్నారు.అనంతరం కక్షిదారులుకు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు హరి కోటేశ్వరరావు,కె.వెంకట నరసింహారావు, బి.వెంకటేశ్వర్లు, పంతగాని వెంకటేశ్వర్లు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకారం : డా. బి.వి. రమణ



**సింగరాయకొండ, జూలై 5 ,ప్రభాతవార్త**

గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి అమ్మ ఫౌండేషన్" ద్వారా విద్యా సహాయాన్ని అందిస్తున్నట్లు ఆత్మనందా స్వామీజీ డాక్టర్ బి.వి. రమణ పేర్కొన్నారు. శనివారం పాత సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని గవదగట్ల వారి పాలెం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవం కలిగి, క్రమశిక్షణతో విద్య అభ్యసించాలి అని పేర్కొన్నారు. ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత ప్రతి విద్యార్థి తన స్వగ్రామం మరియు పాఠశాల పట్లకృతజ్ఞతతో సహకరించాలన్నారు. ఇంకా విద్యాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అర్రిబోయిన రాంబాబు మాట్లాడుతూ డాక్టర్ రమణ సాహితీ, సేవా, ఆధ్యాత్మిక రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్నారని ప్రశంసించారు. అనంతరం డాక్టర్ రమణను శాలువాతో సత్కరించారు. ఉపాధ్యాయులు అజయ్,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గిరిజన కళాశాల బాలికల వసతి గృహం ప్రారంభం



**యర్రగొండపాలెం,జూలై5,ప్రభాతవార్త**

య ర్రగొండపాలెం పట్టణంలో గిరిజన పాఠశాలలో చదువుతున్న బాలికలకు శనివారం మాచర్ల రోడ్డులో నూతన గిరిజన బాలికల వసతి గృహన్ని యర్రగొండపాలెం నియోజక వర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ య ర్రగొండపాలెం నియోజకవర్గంలోని గిరిజన బాలికలకు ఈ వసతి గృహం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు.బాలికలు బాగాచదువుకోని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన కోరారు.అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు.వసతి గృహ ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి మంత్రులు నారాలోకేష్,గుమ్మడి సంధ్యా రాణి,డోలా బాలవీరాంజనేయ స్వామి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు చేకూరి సుబ్బారావు,ఎస్టినాయకులు యం.మత్రునాయక్,చిట్యాలవెంగల్‌రెడ్డి,తోటమహేనాయుడు, వేగినాటి శ్రీను,శనగా నారాయణరెడ్డి, కొత్తమాసు సుబ్రమణ్యం, రెంటపల్లె సుబ్బారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## యల్లారెడ్డి పల్లెగ్రామంలో నీటికి కటకట



**యర్రగొండపాలెం,జూలై 5,ప్రభాతవార్త**

యర్రగొండపాలెం మండలంలోని యల్లారెడ్డి పల్లెలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో అధికారులు పట్టిచుకోలేదని శనివారం గ్రామంలో ఖాళీబిందెలతో నిరసన చేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో నీటి సమస్య ఉందని ఎన్నిసార్లు అధికారులకు,నాయకులకు చెప్పిన పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.శనివారం గ్రామంలో మహిళలు పెద్ద ఎత్తున ఖాళీబిందెలతో నిరసన కార్యక్రమాన్ని చెపట్టినారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఇప్పటికైనా ఉన్నత అధికారులు తమ గ్రామంలో నీటి సమస్య లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

## ఏకేయూ విసిని మర్యాద పూర్వకంగా కలిసిన సంజయ్ కుమార్

**- ఏ.కే.యూ పరిధిలో ఎన్.ఎస్.ఎస్ కార్యక్రమాలపై పర్యవేక్షణ చేసిన వైనం**



**ఒంగోలు - ప్రభాతవార్త**

నూతనంగా ఏర్పడిన ఆంధ్రకేసరి యూనివర్సిటీ నందు ఎన్.ఎస్.ఎస్ (జాతీయ సేవా పథకం)యూనిట్ల పనితీరును స్వయంగా పర్యవేక్షణ చేసేందుకు ఒంగోలు వచ్చిన ఎన్.ఎస్.ఎస్ రీజినల్ డైరెక్టరేట్ ప్రతినిధి ఎన్.సంజయ్‌కుమార్ శనివారం ఏ.కే.యూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్. మూర్తిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్ర కేసరి యూనివర్సిటీ పరిధిలో ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన ఎన్.ఎస్.ఎస్ యూనిట్ల పనితీరు, నిధుల కేటాయింపు, దత్తత తీసుకున్న గ్రామాలలో విద్యార్థులు, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు చేపడుతున్న కార్యక్రమాల గురించి మాట్లాడారు. ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయం నూతనంగా ఏర్పడిన యూనివర్సిటీ అయినప్పటికీ ఎన్.ఎస్.ఎస్ యూనిట్ల పనితీరు ఆశాజనకంగా ఉందని పేర్కొన్నారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీ నందు ప్రస్తుతం ఉన్న యూనిట్లకు అదనంగా మరో 75యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు ఆయన విసి ప్రొఫెసర్ మూర్తికి తెలియ జేశారు. అనంతరం సంజయ్ కుమార్ ను విసి ప్రొఫెసర్ మూర్తి శాలువాతో ఘనంగా సన్మానించారు. అంతకు ముందు సంజయ్ కుమార్ ఆంధ్ర కేసరి యూనివర్సిటీ లో ఉన్న స్థానిక ఎన్.ఎస్.ఎస్.కో ఆర్డినేటర్ కార్యాలయాన్ని సందర్శించి స్థానిక కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్ తో మాట్లాడారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీ పరిధిలో ఎన్.ఎస్.ఎస్ యూనిట్ల పనితీరు, విద్యార్థులు చేపడుతున్న కార్యక్రమాలు, ప్రత్యేక క్యాంపులు, నిధుల వినియోగం తదితర అంశాల గురించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ఎన్.ఎస్.ఎస్ యూనిట్లు పని చేస్తున్న తీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేసిన సంజయ్ కుమార్ ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్‌కుమార్‌ను హృదయ పూర్వకంగా అభినందించారు.

## చంద్రబాబు సారధ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు

**- ఎమ్మెల్యే ఉగ్ర**



**వెలిగండ్ల, జూలై 5, ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలో రాష్ట్రం గత ప్రభుత్వ విధ్వంసం నుండి కోలుకొని అభివృద్ధి వైపు పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలకేంద్రమైన వెలిగండ్లలోని 40 బూత్‌లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని ప్రజలకు అందించడం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్రకార్యదర్శి దొడ్డ వెంకట సుబ్బారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గవదకట్ల హరికృష్ణ , మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, వెలిగండ్ల ఎంపీటీసీ చిలకల వెంకటేశ్వరరెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కసునూరి మౌలాలి, వెలిగండ్ల గ్రామ పార్టీ అధ్యక్షులు కారంపూడి కృష్ణారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శాంతి కళ్యాణం




**అద్దంకి , జూలై 5, ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ లక్షీ మ్రనరసింహస్వామి వారి దేవస్థానము నందు శని వారం స్వామివారి జన్మ నక్షత్రం, స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామి వారికి శాంతి కళ్యాణ మహోత్సవము ఘనంగా నిర్వహించారు.వివాహ ఆరోగ్య సంతాన కుజదోష సమస్యల నివారణకు ఈ కళ్యాణ క్రతువులో పాల్గొన్నవారికి దోషనివారణ జరుగునని అర్చక స్వాములు తెలియజేశారు. ప్రతినెల స్వామి వారి జన్మ నక్షత్రమైనస్వాతినక్షత్రం రోజున ఈ కళ్యాణము జరుగు తుందని తెలిపారు. ఈ కళ్యాణంలో పాల్గొను దంపతులు 1116/ చెల్లించి కళ్యాణంలో పాల్గొన్నాలని కార్యనిర్వాణాధికారి తెలిపారు. కళ్యాణం అనంతరం భక్తులందరికీ ప్రసాదం పంపిణీ చేశారు.

## అద్దంకిలో జాతీయ లోక్ అదాలత్

**- మూడు కోర్టుల పరిధిలో 1873 కేసుల పరిష్కారం**




**అద్దంకి , జూలై 5 ,ప్రభాతవార్త**

ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు శనివారం అద్దంకి కోర్టు భవనముల సముదాయము నందు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మూడు కోర్టుల పరిధిలో కేసుల పరిష్కారాల కొరకు రెండు బెంచీలు ఏర్పాటు చేయడమైనది. మొదటి బెంచ్ లో సీనియర్ సివిల్ జడ్జి డి.నాగ వెంకటలక్షి మ్మ, మండల న్యాయ సేవ అధికార కమిటీ చైర్మన్, ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా న్యాయవాదులు ఆకుల సత్యవతి, షేక్ మహమ్మద్ రఫీ సభ్యులుగా వ్యవహరించారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టు బెంచ్ లో హెచ్ఎంఒపి 1లో ఎగ్జిక్యూషన్ పిటిషన్ కేసులు 4, 14 లక్షల పదివేలు విలువ కేసులు పరిష్కారం అయ్యాయి. ఒరిజినల్ సూట్ : 1 10 లక్షల రూపాయలు విలువ గల కేసు పరిష్కారమైనది, రెండవ బెంచ్ లో బి అఖిల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రిసైడింగ్ ఆఫీసర్ గా డి హయగ్రీవ చారి, మార్తా శీను సభ్యులుగా వ్యవహరించారు. ఈ లోక్ అదాలత్ బెంచ్ లో ఒరిజినల్ సూట్స్ 13,గాను 37, లక్షల 70వేలు విలువగల కేసులు పరిష్కారం అయ్యాయి. టైటిల్ కేసులు 5 గాను, 13 లక్షల25 వేలు విలువ గలిగిన కేసులు, ఎగ్జిక్యూషన్ పిటిషన్ కేసులు 5, 9 లక్షల 10 వేలు, క్రిమినల్ కేసులు 28, 5 లక్షల 65 వేలు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో ఎస్‌టిసి పిఇటిటిఐ కేసులు 1460, 3 లక్షల 20వేల 800 రూపాయలు విలువ కలిగిన, క్రిమినల్ కేసులు 379 పరిష్కారమైనవి.

## ఏఐఐఈఏ 75వ ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాలు

**- వృద్ధాశ్రమంలో అన్నదానం కొరకు సరుకుల పంపిణీ**

**- బధిరుల పాఠశాలలో నోట్ పుస్తకాలు అందజేత**





**అద్దంకి , జూలై 5 ప్రభాతవార్త**

అద్దంకిఎల్ఐసి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏఐఐఈఏ 75వ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలలో భాగంగా సింగరకొండలోని వృద్ధాశ్రమంలో శనివారం భోజనానికి అవసర మైన సరుకులు అందజేశారు. అదేవిధంగా డెఫ్ అండ్ డం స్కూలులో నోట్ పుస్తకాలతో పాటు స్టేషనరీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం డివిజనల్ జాయింట్ సెక్రెటరీ ఆర్ వి ఎస్ రామిరెడ్డి, డివిజనల్ వైస్ ప్రెసిడెంట్ పారా శ్రీనివాసరావు, అద్దంకి ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్‌మేనేజర్,ఉద్యోగుల సంఘం నాయకులు, ఎల్ఐసి ఏజెంట్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎ.ఒ.



**జె.పంగులూరు , జూలై 5, ప్రభాతవార్త**

పంగులూరు మార్కెట్ యార్డ్ లోని నల్లబెల్లి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి డి సుబ్బారెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో డి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ జూన్ 30వ తేదీ నుండి నల్లబర్లి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పంగులూరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో ప్రారంభించి, కొనుగోలు చేస్తున్న విషయము రైతులకు విధితమే. రైతులు కొనుగోలు కేంద్రమునకు పొగాకు చెక్కులు తీసుకొని వచ్చేముందు తప్పనిసరిగా గ్రేడింగు, తేమశాతం మరియు చెక్కులు పై పట్టాలు విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రభుత్వము నిర్ణయించిన మద్దతు ధరకు అమ్ముకొనుటకు అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారి డి సుబ్బారెడ్డి రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రానికి పొగాకు తీసుకొని వచ్చేముందు తప్పనిసరిగా తేమ 20 శాతం లోపు ఉండే విధంగా చూసుకోవాలని, చెక్కులపై పట్టాలు చిరిగిపోకుండా నాణ్యమైన పట్టాలు వేయాలని, పొగాకు గ్రేడింగ్ సక్రమంగా చేసుకొని ఏ గ్రేడ్ కి ఆ గ్రేడు అంటే పై ఆకులు విడివిడిగా ఉండే విధంగా చెక్కలు కొనుగోలు కేంద్రానికి తీసుకొని రావటం వలన రైతుకు మంచి గిట్టుబాటు ధరలతో లాభం చేకూరుతుందన్నారు. తెచ్చిన పొగాకును తిప్పి పంపకుండా కొనుగోలు చేయడానికి అవకాశం ఉందని, కావున కొనుగోలు కేంద్రానికి పొగాకు తెచ్చే రైతులు తప్పనిసరిగా పై నిబంధనలు పాటించి కొనుగోలు కేంద్ర అధికారులకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో కొనుగోలు కేంద్రం అధికారి ,ప్రాథమిక వ్యవసాయ పరపతి సంగం అధికారిని రావూరి లక్షీ మ్రదేవి, జి ఆదిరెడ్డి, మరియు తదితర రైతులు పాల్గొన్నారు.

## కుల నిర్మూలన పోరాట సమితి

## రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్‌ను వెంటనే విడుదల చేయాలి

**- జూలై 19 వ తేదీన ఒంగోలులో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి**



**సంతనూతలపాడు, జూలై 5, ప్రభాతవార్త**

కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్‌పై ఎన్ఐఏ పోలీసులు అక్రమంగా కేసు బనాయించి గత రెండేళ్లుగా చత్తీష్‌గడ్ రాష్ట్రంలో జైల్లో నిర్బంధించారు. బెయిల్ రాకుండా అడ్డుకుంటూ అక్రమంగా నిర్బంధించిన దుడ్డు ప్రభాకర్‌ను, తదితరులను వెంటనే విడుదల చేయాలని జూలై 19వ తేదీ ఒంగోలులో కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు అంబేద్కర్ భవన్లో జరుగుతుంది. ఈ సదస్సుకు సంబంధించిన కరపత్రమును ఒంగోలులోని మంచి పుస్తకం షాపు దగ్గర ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి ఎం.జార్జి మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న దుడ్డు ప్రభాకర్‌ను అక్రమంగా అరెస్టు చేసి గత రెండు సంవత్సరాలుగా జైల్లో నిర్బందించడం అన్యాయమని వెంటనే దుడ్డు ప్రభాకర్‌ను విడుదల చేయాలని జూలై 19వ తేదీన ఒంగోలులో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావల సుధాకర్‌రావు, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు, బహుజన సమాజ్ పార్టీ నాయకులు తాటిపర్తి వెంకట స్వామి, రెడ్ స్టార్ జిల్లా క్యాదర్శి భీమవరపు సుబ్బారావు, కేఎన్‌పీఎస్ నాయకులు జ్యోతి సుబ్బారావు, రచయిత కత్తి కళ్యాణ్, బహుజన రచయిత పిన్నిక శ్రీనివాస్, ఐఎల్పీ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం, ఏఐబీఎస్పీ రాష్ట్ర నాయకులు పేరం సత్యం, గుంటూరు మస్తాన్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, ఎస్‌డీపీఐ నాయకులు సత్తార్, కార్మిక నాయకులు ప్రజాస్వామిక వాదులు లింగ వెంకటేశ్వర్లు, ఆవుల సుబ్రహ్మణ్యం, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు వీర భద్రాచారి తదితరులు కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- ఎస్పీ ఏఆర్ దామోదర్**

**వెలిగండ్ల, జూలై 5, ప్రభాతవార్త**

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ దామోదర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు పట్ల ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని అన్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే ఫిర్యాదు దారులతో గౌరవంగా ప్రవర్తించి వారి సమస్యలు తెలుసుకోవాలని అన్నారు. వీరి వెంట కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, పామూరు సీఐ భీమా నాయక్ పాల్గొన్నారు.

## వెంకటేశ్వరస్వామి పాదాల వద్ద ప్రత్యేక పూజలు



**బల్లికురవ, జూలై 5, ప్రభాతవార్త**

వెంకటేశ్వరస్వామి నామాల ప్రతిష్ఠాపన శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారి పాదాలు, నామాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దంపతులు నామాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామివారికి తీర్ధ ప్రసాదాలు సమర్పించారు. అనంతరం సాయంత్రం వేళ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కొనసాగింది.

## ప్రతికూల శక్తుల నుండి రక్షించే శ్రీ వారాహి దేవి

**- శ్రీసురాభిదాసు బ్రహ్మశ్రీ కుందుర్తి మహీకిరణ్ శర్మ.**

**- శ్రీ బాపూజీ గో సంరక్షణ సంఘం ప్రాంగణంలో శ్రీ మహి వారాహి హోమం**

**- హోమ క్రతువులో పాల్గొన్న భక్తులు**

**ఒంగోలుకల్చరల్,జూలై 5,ప్రభాతవార్త**

శ్రీ మహా వారాహి నవరాత్రుల సందర్భంగా జులై 4వ తేదీ నుండి 6వ తేదీ వరకు మూడు రోజులు పాటు స్థానిక శ్రీ బాపూజీ గో సంరక్షణ సంఘం గోశాలలో "గో త్రిరాత్ర హోమం" గో ఉపాసకులు శ్రీసురాభిదాసు బ్రహ్మశ్రీ కుందుర్తి మహీకిరణ్ శర్మ యాగ్నికత్వంలో నిర్వహిస్తున్నారు. ఆ కార్యక్రమంలో భాగంగా తొలి రోజు శుక్రవారం రాత్రి శ్రీ మహి వరాహ (వారాహి) హోమం అర్ధరాత్రి వేళ యజ్ఞ క్రతువులో శాస్త్రోక్తంగా సమిధలను మంత్రించి హోమాగ్నిని రగిలించారు. కార్యక్రమానికి ముందుగా మహికిరణ్ శర్మ వరాహ నరసింహస్వామి వారాహి దేవి వివరణను వారి వృత్తాంతాన్ని విపులీకరించారు. మధ్య మధ్య అద్భుతమైన తమ గాత్రంతో స్వామి పాటలను స్తోత్రాలను పటిస్తూ క్రతువులో పాల్గొన్న భక్తి ఆరాధనతో పాల్గొన్న హోమకర్తలకు ఉత్సాహాన్ని, భక్తిని ప్రేరేపించారు. దేవతలకు తృప్తి కలిగించడానికి హోమాలు నిర్వహిస్తామని, తద్వారా దుష్ట పీడలన్నీ తొలగి సౌభాగ్యము, సంపదలు, ఆరోగ్యము ఐశ్వర్యము కలుగుతాయని వివరించారు. తూనుగుంట మల్లికార్జునరావు దంపతులచే పూర్ణాహుతి కావింపజేశారు. ఈ వార్త ప్రచురితమయ్యే సమయానికి 5వ తేదీ శనివారం శ్రీ గోవింద నామావళి హోమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో దంపత సమేతంగా హోమకర్తలు పాల్గొన్నారు శ్రీ బాపూజీ గోసంరక్షణ సంఘం అధ్యక్షులు చలువాది వెంకట శ్రీనివాస్ మూర్తి, కార్యదర్శి చలువాది బ్రహ్మయ్య, కోశాధికారి పేర్ల వెంకట నరసింహారావు, సహకార్యదర్శి గుర్రం బద్రీ నారాయణ, వేమూరి చక్రధర పెరుమాళ్ళు, శ్రీగిరి గిరి ప్రదక్షణ కమిటీ అధ్యక్షులు రాధా రామణ గుప్త జంధ్యం, సహకార దర్శి నేరెళ్ల శ్రీనివాసరావు మరియు పౌర్ణమి తిథి గిరి ప్రదక్షి ణ నిర్వాహకులు బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

## సింగరాయకొండలో మెగా లోక్ అదాలత్

**- 22 ఎక్సైజ్ కేసులు పరిష్కారం**





**సింగరాయకొండ, జూలై 5 ,ప్రభాతవార్త**

సింగరాయకొండ సబ్ డివిజన్ పరిధిలోని ఎక్సైజ్ స్టేషన్ కు చెందిన 22 పెండింగ్ కేసులను సత్వరమే మెగా లోక్అదాలత్‌లో ప్రవేశ పెట్టడంతో పరిష్కరించ బడ్డాయని ప్రొహిబిషన్ !! ఎక్సైజ్ సీఐ ఎం.శివకుమారి తెలిపారు.దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు శనివారం సింగరాయకొండ మండలకాంప్లెక్స్‌లోని జూనియర్ సివిల్ జడ్జికోర్టులోజడ్జి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ ఎం.శివకుమారి మాట్లాడుతు.ఈ పరిష్కారించిన ఈ కేసుల ద్వారా ప్రభుత్వ ఖాతాలో రూ.1,25,670/ చలానా రూపంలో జమ చేయసినట్టు ఆమె తెలిపారు. తక్కువ సమయంలో, పరస్పర సమ్మతితో కేసులు పరిష్కరించగల ఈ లోక్ అదాలత్ విధానం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందని ఆమె పేర్కొన్నారు.

### రాజీతో 263 కేసుల పరిష్కారం

దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా లోక్ అదాలత్ లో 263 కేసులు పరిష్కరించబడ్డాయని ఎస్సై బి.మహేంద్ర ఓ ప్రకటన లో తెలిపారు. శనివారం సింగరాయకొండ పట్టణంలోని మండల కాంప్లెక్స్ లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులోని జడ్జి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మెగా లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్‌కు సింగరాయకొండ కోర్టు పరిధిలోని ఐదు మండలాలకు చెందినకక్షదారులు పెద్దఎత్తున హాజరై, తమ కేసులను ఇరువురు పరస్పర రాజీ ద్వారా పరిష్కరించుకున్నారని, ఒకే కుటుంబానికి చెందిన 13 కేసులు సత్వరమే ఇరువురు పరస్పర రాజీతో పరిష్కరించడం జరిగిందని అన్నారు. ఇప్పటివరకు సుమారుగా 250 కేసులు రాజీ ద్వారా ముగింపు పొందినట్టు చెప్పారు.ప్రస్తుతం కూడా కొన్ని కేసులపై లోక్ అదాలత్ జరుగుతూనే ఉందని, అవసరమైతే అర్ధరాత్రి వరకూ ప్రక్రియ కొనసాగుతుందని, ప్రజలకు న్యాయసేవలు అందించడంలో జడ్జి నిరంతర కృషి చేస్తున్నారని ఎస్.ఐ తెలిపారు.

## శ్రీనారాయణ ప్రత్యంగి రామహా దేవి ఆలయ హోమంలో పాల్గొన్న పీఠాధిపతులు





**కొనకనమిట్ల, జూలై 5, ప్రభాతవార్త**

మండలంలోని కొనకనమిట్ల సమీపాన గజేంద్ర గిరిపై కొలువైన శ్రీ భద్రకాళి సహిత శ్రీ భూబాణలింగేశ్వర స్వామి సహిత నారాయణి ప్రత్యంగిరా దేవి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజ, ఎండు మిరప కాయల హోమంలో పిఠాధిపతులు పాల్గొన్నారు. అయోధ్య నుండి రామ జన్మ భూమి ట్రస్టు చైర్మన్ , పీఠాధిపతి జనమెజయ్ శరణ్ మహారాజ్ స్వామీజీ, వారణాశి నుండి శ్రీ పీఠం వ్యవస్థాపకులు డాక్టర్ సత్యప్రకాష్ త్రిదండి తివారి గురువు బొంబాయి నుండి చిన్న మస్తాన్‌దేవి, పీఠాధిపతులు పద్మమ్మ కాఈ మాతాజీ తోలేటి శ్రీకాంత్మాజీ విశ్వబ్రాహ్మణ చైర్ పర్సన్ వాకా బాల గంగాధర్, టిసాసా ఫౌండేషన్ చైర్మన్ రావూరి కమిటీ సభ్యులు చిడిపోతు శ్రీనివాసరావు, సిద్దాంతి యేదుపాటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఆశ్రమ వ్యవస్థాపకురాలు మాతాజీ కృష్ణవేణమ్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం, ఎండు మిరప కాయల హోమం తదితర కార్యక్రమాలు జరిగాయి. ప్రధాన అర్చకులు బాలబ్రహ్మాచార్యులు తెలిపారు.

## పాత కక్షల నేపధ్యంలో

## నల్లగుంట్లలో బైరబోయిన వెంకటేశ్వర్లు దారుణ హత్య

**- హత్యకు గురైన బైరబోయిన వెంకటేశ్వర్లు సర్పంచ్ నాగలక్ష్మీ భర్త మొద్దు వెంకటేశ్వర్లు హత్య కేసులో ప్రధాన నిందితుడు**

**- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తం**

**- భయాందోళనలో ప్రజలు**







**పెద్దదోర్నాల, జూలై 5, ప్రభాతవార్త**

పెద్దదోర్నాల మండలం నల్లగుంట్ల గ్రామంలో పాత కక్షల నేపధ్యంలో బైరబోయిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి శుక్రవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యారు. కత్తులతో కిరాతకంగా హత్య చేశారు. ఈ సంఘటన నల్లగుంట్లలో కలకలం రేపింది. నల్లగుంట్ల సర్పంచ్ నాగలక్ష్మీ భర్త మొద్దు వెంకటేశ్వర్లును 2021వ సంవత్సరంలో బైరబోయిన వెంకటేశ్వర్లు నరికి హత్య చేశాడు. హత్యకు గురైన ఇరు వర్గాలు ఒకే పార్టీకి చెందిన వారైనప్పటికి సర్పంచ్ ఎన్నికల సమయంలో ఇరు వర్గాల మధ్య గొడవలు ఉన్నాయి. హత్యకు గురైన బైరబోయిన వెంకటేశ్వర్లు భార్యను గతంలో హత్యకు గురైన మొద్దు వెంకటేశ్వర్లు కొట్టాడన్న కోపంతో బైరబోయిన వెంకటేశ్వర్లు మరికొందరు కలిసి గతంలో మొద్దు వెంకటేశ్వర్లను హతమార్చారు. అప్పటి నుండి సమయం కోసం బైబోయిన వెంకటేశ్వర్ల ప్రత్యర్ధి వర్గం సమయం కోసం వేచి ఉంది. ఇది ఇలా ఉంటే ఈ మధ్య కాలంలో బైరబోయిన వెంకటేశ్వర్లు నల్లగుంట్ల గ్రామం వచ్చి ఉంటున్నాడు. అయితే శుక్రవారం రాత్రి పీర్ల షరిగెత్తు ఉండటంతో బైరబోయిఽ వెంకటేశ్వర్లు పీర్ల అగ్ని గుండం వద్దకు వచ్చాడు. ఇదే అదునుగా భావించిన ప్రత్యర్ధి వర్గం కత్తులతో దాడి చేసి నరికి హత్య చేసి పారిపోయినట్లు సమాచారం. సమాచారం అందుకున్న మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు, యర్రగొండపాలెం సీఐ ప్రభాకరరావు, ఎస్సై వి.మహేష్ సంఘనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు కారణాలు పరిశీలిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు మాట్లాడుతూ గతంలో నల్లగుంట్ల సర్పంచ్ భర్త మొద్దు వెంకటేశ్వర్లును హత్య చేసిన కేసులో బైరబోయిన వెంకటేశ్వర్లు ప్రధాన నిందితుడు. దీంతో ఇరు వర్గాల మధ్య పాత కక్షలు ఉన్న నేపధ్యంలో ఈ హత్య చోటు చేసుకుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తూ నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి విచారణ చేస్తున్నాం.

## సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల

### - పొదిలి, కొనకనమిట్ల మండలాల్లో పర్యటన



**కొనకనమిట్ల, జులై 5, ప్రభాతవార్త**
పొదిలి మండలం అన్నవరం, కొనకనమిట్ల మండలం పెద్దారికట్లలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో నాయకులతో కలిసి శనివారం పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ ఎన్నిలక ముందు ఇచ్చిన 80 శాతం హామీలను మొదటి సంవత్సరంలోనే పూర్తి చేశారని, త్వరలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు నిధులు అందజేయడం, వచ్చే నెలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం లభించనున్నట్లు చెప్పారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందించి పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి ఆవులూరి యలమంద టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, పొదిలి ఏఎంసీ చైర్మన్ ఇమాంస, మాజీ మండల కన్వీనర్ ఎర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ పులి శ్రీలత, వెంకటేశ్వరరెడ్డి, మండల యువ నాయకులు కట్ట బ్రహ్మారెడ్డి, మండల, పట్టణ టీడీపీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

**పెద్దారికట్లలో :**
మండలంలోని పెద్దారికట్లలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హాజరయ్యారు. నాయకులతో కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మోరబోయిన బాబురావు, బాపతి కృష్ణారెడ్డి, క్లస్టర్ ఇన్చార్జీలు, బూత్ కమిటీ ఇన్చార్జీలు, ఆ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మధుసూదన్‌రెడ్డి



**తాళ్లూరు, జులై 5 ,ప్రభాతవార్త**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శిగా బెల్లంకొండవారిపాలెం గ్రామానికి చెందిన పోశం మధుసూదన్‌రెడ్డి శనివారం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆయనకు నియామక పత్రం అందజేశారు. తనను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించిన జగనన్నకు, పదవి వచ్చేందుకు కృషి చేసిన దర్శి ఎమ్మెల్యే, వైకాపా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఉన్నత పదవి బాధ్యతలు అప్పచెప్పిన వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా రాష్ట్రంలో తన వంతు సేవలు అందిస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. మధుసూదన్‌రెడ్డికి ప్రజా ప్రతినిధులు, పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. కాగా మధుసూదన్‌రెడ్డి తాళ్లూరు ఎంపీపీగా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గతంలో పని చేశారు.

## వేడుకగా పెద్ద షరగత్



**తాళ్లూరు, జులై 5, ప్రభాతవార్త**
మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్ద షరగత్ ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ముందుగా హోమగుండం వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. మండలంలోని సోమవరప్పాడు, బొద్దికూరపాడు, గంగపాలెం గ్రామాల్లో పీర్ల చావిళ్లను సుందరంగా ముస్తాబు చేశారు. ఆదివారం కూడా పెద్ద షరగత్ వైభవంగా నిర్వహించేందుకు ఆయా కమిటీల సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ భీమిరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి, గుంటి గంగ ఆలయ మాజీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, మైనార్టీ సెల్ అధ్యక్షులు బచ్చా, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం

### - విశాఖపట్నం వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



**సీఎస్‌పురం, జులై 5, ప్రభాతవార్త**
సంవత్సర కాలంగా మహిళలకు ఆడ బిడ్డ నిధి, తల్లికి వందనం, నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందని కనిగిరి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు అన్నారు. శనివారం రుషికొండ ఏ 1 కన్వెన్షన్ హాల్‌లో విశాఖపట్నం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో కదిరి బాబురావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కదిరి బాబురావు మాట్లాడుతూ 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని ఇవ్వకుండా నిరుద్యోగ యువతీ యువకులకు చంద్రబాబునాయుడు మోసం చేశారని అన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి నేటికి ఇవ్వలేదని రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి 3 వేలు చొప్పున ఏడాదిలో 36 వేలు ఇవ్వాలని అన్నారు. అదే విధంగా గత సంవత్సరం ప్రతి విద్యార్థికి రూ.15వేలు చొప్పున అమ్మ ఒడి ఇవ్వకుండా మహిళలకు మోసం చేశారని ఆరోపించారు. ఆడ బిడ్డ నిధి కింద ప్రతి మహిళకు ఇస్తామన్న 1500 అవి కూడా ఇవ్వలేదని అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదైన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని అన్నారు. పేద ప్రజల సంక్షేమం జగన్‌తోనే సాధ్యమని కదిరి బాబురావు అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, శాసనమండలి సభ్యులు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు కేకే రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి

### - పొదిలి ఆర్టీసీ డిపో సందర్శన

### - ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి



**కొనకనమిట్ల, జులై 5, ప్రభాతవార్త**
ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, గత ప్రభుత్వం ఆర్టీసీని విలీనం చేసిన అభివృద్ధి జరగలేదని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం పొదిలి ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆగష్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి డిపోలో సోలార్ రూఫ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు, ఎలక్ట్రికల్ బస్సులు కూడా ప్రభుత్వం కొనుగోలు చేయనుంది అన్నారు. త్వరలో ఆర్టీసీ జోనల్ సమావేశం జరుగుతుందని, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు పాల్గొని ఆర్టీసీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చిస్తారన్నారు. ప్రయాణికులను ఆకట్టుకునే విధంగా ఆర్టీసీ బస్టాండ్లలో సుందరీకరణకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పొదిలి నుంచి మార్కాపురంకు ఆర్డినరి బస్సులు నడపాలని, ప్రైవేటు బస్సులు డిపో సమీపంలో నిలపడం వల్ల ఆర్టీసీ బస్సులు ఆదాయానికి గండి పడుతుందని పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తొలుత మరుగుదొడ్లను ఆర్టీసీ క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. శుభ్రత విధిగా పాటించాలని, అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవన్నారు. ఆర్డినరి బస్సులు ఎక్కి ప్రయాణికులతో మాట్లాడారు. డిపో గ్యారేజీలో పరిశుభ్రతతో నిర్వహిస్తున్న స్టాఫ్‌ను ప్రత్యేకంగా శాలువా కప్పి అభినందించారు. డిపో మేనేజర్ శంకరరావుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డిపోలోని ముఖ్యమైన సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చైర్మన్ సురేష్‌రెడ్డి వెంట ఆర్టీసీ అధికారులు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాకినేని అమరసింహం, జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మీ, తెలుగుదేశం సీనియర్ నాయకులు బెల్లంకొండ శ్రీనివాసరావు, మైనార్టీ జిల్లా కో కన్వీనర్ ఎస్‌డీ ఖాదర్ భాషా, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్, పొదిలి మండల అధ్యక్షుడు దోర్నాల రమణారెడ్డి, కొనకనమిట్ల మండల అధ్యక్షులు సురేష్‌బాబు, పొదిలి పట్టణ అధ్యక్షుడు యుద్దం మహేష్, బీజేపీ యూత్ ప్రెసిడెంట్ షేక్ రఫీ, సీనియర్ నాయకులు మాగులూరి రామయ్య, బిసా ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు. తొలుత జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డిని నాయకులు, అధికారులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

## పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

### - సీపీఐ ఆధ్వర్యంలో తహాశీల్దార్‌కు వినతి



**కొనకనమిట్ల, జులై 5, ప్రభాతవార్త**
పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు తగ్గించాలని స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం తహశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ ఏ.సురేష్‌కు సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు తిలోదకాలు ఇచ్చిందన్నారు. దీంతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపటమేనని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందని మండల కార్యదర్శి కే.కోటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి కే.కోటేశ్వరరావు, నాయకులు పీవీ కొండయ్య, పి.పిచ్చయ్య, కే.చిన్న బ్రహ్మయ్య, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక లేబర్ కోడ్స్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జీప్ జాత ప్రచారం



**గిద్దలూరు, జూలై 5, ప్రభాతవార్త**
కార్మిక లేబర్ కోడ్స్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం గిద్దలూరు పట్టణంలో సిఐటియు సమ్మె జీప్ జాత ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ ముఠా, మున్సిపల్, ఆటోస్టాండ్ దగ్గర ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎం రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో బిజేపి ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు పోరాడి సాధించుకున్న 29కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా తీసుకొచ్చి కార్మికులను బాణిసలుగా మార్చేందుకు ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఈ నాలుగు కోడ్స్ రద్దు చేయాలని పాత కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను గిద్దలూరు పట్టణంలో ఉన్న కార్మికులు, ఉద్యోగులు అందరూ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని, రవాణా రంగ కార్మికులపై పెంచిన చలానాలను రద్దు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26వేలు అమలు చేయాలని, కార్మిక ఉద్యోగభద్రత కల్పించాలని, అసంఘటిత కార్మికులకు సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతాలో సిఐటియు జిల్లా నాయకులు డికెఎం రఫి పి రూబిన్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనిని పట్టణ ప్రాంతాలకు విస్తరింపజేయాలని, ఉపాధి హామీ పనిని 200రోజులు అమలు చేయాలని, కనీస కూలీ రోజుకు 600ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ జాతా కార్యక్రమంలో ముఠా కార్మికులు, మున్సిపల్ కార్మికులు, ఆటో కార్మికులు, సిఐటియు నాయకులు టి ఆవులయ్య, పి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డిని కలిసిన వైసిపి నాయకులు



**గిద్దలూరు, జూలై 5, ప్రభాతవార్త**
గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్సీపి నాయకులు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డిని కంభం మండలం తురిమెళ్ళ పంచాయితీకి చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గిద్దలూరు పట్టణంలోని ఆయన కార్యాలయంలో వారు ప్రవీణ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి వైసిపి నాయకులు, కార్యకర్తలతో పంచాయితీలో నెలకొని ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్సీపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియోజకవర్గంలో వైసిపి నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండాలని తమకు సూచించారని మీకు ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా తప్పకుండా తమను సంప్రదించాలని తెలిపారు. నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని ప్రవీణ్ కుమార్ రెడ్డి వారికి సూచించారు.

## శ్రీ రంగస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషిచేస్తా

### - ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి



**రాచర్ల, జూలై 5, ప్రభాతవార్త**
గిద్దలూరు నియోజకవర్గంలోని శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామివారి దేవస్థానం అభివృద్ధికి తమవంతు కృషిచేస్తానని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి అన్నారు. శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానాన్ని శనివారం ఆయన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారిరువురు స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన అర్చకులు స్వామివారి తీర్ధ ప్రసాదాలను వారికి అందజేశారు. అనంతరం ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే అశోక్ రెడ్డిలు దేవస్థానంలో జరగవలసిన అభివృద్ధి పనులపై గిద్దలూరు డిఎఫ్ఓ నిషాకుమారి, రాచర్ల తహాశిల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ ఎస్ వెంకటరామిరెడ్డిలతో చర్చించారు. దేవస్థానంలో అభివృద్ధి పనులు ఆగుటకుగల అటవీశాఖ తరపున అనుమతులు రావాల్సి ఉన్నాయని, వాటికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వాటి గురించి డిఎఫ్ఓతో చర్చించి త్వరలో పరిష్కార మార్గమును చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి కావలసిన సహాయ సహకారాలు అందించగలమని తెలిపారు. ఎంపి పర్యటన సందర్భంగా గిద్దలూరు సిఐ జె రామకోటయ్య, కంభం సిఐ మల్లిఖార్జున, రాచర్ల ఎస్సై పి కోటేశ్వరరావులు తమ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

## కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు సుపరిపాలన సాధ్యం

### - గిద్దలూరు పట్టణంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంపి మాగుంట, ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు, జూలై 5, ప్రభాతవార్త**
గిద్దలూరు నియోజకవర్గంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసుల రెడ్డి, స్థానిక శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డితో కలిసి పర్యటించారు. ముందుగా ఆర్యవైశ్య సోదరులతో కలిసి ఆత్మీయ సమావేశమయ్యారు. అనంతరం రాచర్ల మండలంలోని శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామివారి ఆలయాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డితో కలిసి సందర్శించి ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు. అంతకుముందు ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాలలో పాల్గొని అర్చకులు అందించిన తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గిద్దలూరు పట్టణం నుండి పాములపల్లె గ్రామానికి రూ.1.8కోట్లతో నిర్మించే ఆర్అండ్ బి రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టి శిలాఫలకాన్ని ప్రారంభించారు. 16వ వార్డులో 39లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ఎంపి మాగుంట ప్రారంభించారు.

**16వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి మాగుంట :**
గిద్దలూరు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన అనంతరం 16 వార్డులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పాల్గొన్నారు. వార్డులో ఇంటింటికి వెళ్ళి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఆగష్టు 15వ తేదీనుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 2నెలల వ్యవధిలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి సిఎం చంద్రబాబు అందిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుందని, ముఖ్యంగా పశ్చిమ ప్రకాశం ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. పశ్చిమ ప్రకాశం ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. పశ్చిమ ప్రకాశం ప్రాంతంలోనొ 18మండలాలు,570కి పైగా గ్రామాలలో నీటి సమస్యను పరిష్కరించేందుకు జల జీవన మిషన్ పథకం కింద రూ.1290కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టును ఇప్పటికే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రారంభించారని అలాగే గిద్దలూరులో నీటి ఎద్దడి నిర్మూలించేందుకు రూ.160కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని, సగిలేరు వాగు ముంపు ప్రాంతంలో రక్షణ గోడ ఏర్పాటు చేయడం, పట్టణంలో సిసి రోడ్ల నిర్మాణం కోసం రూ.30కోట్లు కేటాయించడం జరిగిందని ఎంపి మాగుంట అన్నారు. ఇప్పటికే తల్లికి వందనం పథకంతో విద్యార్థుల తల్లుల ఖాతాలోకి రూ15వేలు జమచేయడం జరిగిందని, అన్న క్యాంటీన్‌లు ప్రారంభించడం చెప్పిన మాట ప్రకారం పెంచిన పెన్షన్లు అందించడం, నిరుద్యోగులకు డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయటం, రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించడం, రాష్ట్రంలో దెబ్బతిన్న రోడ్లకు చాలా వరకు మరమ్మతులు పూర్తి చేయటం వంటికి కూటమి ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నగర పంచాయితీ ఛైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, జడ్‌పిటిసి సభ్యులు బుడతా మధుసూధన్, కొత్తపల్లి శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్లు బైలడుగు బాలయ్య, పూనూరు భూపాల్ రెడ్డి, సొసైటీ బ్యాంకు ఛైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, మాజీ జడ్‌పిటిసి సభ్యులు కుప్పా రంగసాయి, పట్టణ అధ్యక్షులు శానేషావలి, స్థానిక నాయకులు పల్లె శ్రీనివాసరెడ్డి, సయ్యద్ నాబ్ రసూల్, మండల పార్టీ అధ్యక్షులు పట్టణ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం





**మార్కాపురం రూరల్, జూలై 5, ప్రభాతవార్త**
మార్కాపురం మండల ప్రజాపరిషత్ సమావేశ భవనంలో శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షులు బండి లక్ష్మీదేవి అధ్యక్షతన ఎంపిడిఓ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పౌరసరఫరాలు రెవెన్యూ అంశాలపై సమీక్ష, విద్యుత్ శక్తిపై సమీక్ష, మండలం నందు మంచినీటి ఎద్దడిపై సమీక్ష (ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ), జలజీవన్ మిషన్ (జేజేఎం) వైద్య,ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ పథకములపై సమీక్ష విద్యా కార్యాలయములపై సమీక్ష, పశు పంచాయితీ రాజ్ పనులు, జనరల్ ఫండ్, 15 ఫైనాన్స్ మొదలగు పనులపై సమీక్ష, సంవర్ధక శాఖపై సమీక్ష, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకముపై సమీక్ష, హౌసింగ్‌పై సమీక్ష, ఇరిగేషన్ పథకములు మరియు వెలుగొండ ప్రాజెక్టుపై సమీక్ష, గ్రామ పచాయితీలు మరియు జిపిడిపిపై సమీక్ష, వెలుగు మరియు సంక్షేమ పథకములపై సమీక్ష(డిఆర్‌డిఏ), ఆర్అండ్‌బి అంశాలపై సమీక్షలు చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ బి శ్రీనివాసులు, బాపనరెడ్డి ఏఓ బుజ్జిబాయి, ఎం ఈఓ రాందాస్ నాయక్, మండల పరిధిలోని అన్ని శాఖల అదికారులు, సంబంధిత ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఉచిత పండ్లమొక్కల పంపిణీని సద్వినియోగం చేసుకోండి

### - మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి



**మార్కాపురం రూరల్, జూలై 5 ,ప్రభాతవార్త**
పర్యావరణ పరిరక్షణలో భాగంగా కార్బన్ ప్రాజెక్టు కొరకు వరాహ ఏజి ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో అసిస్ట్ స్వచ్ఛంధ సంస్థ ద్వారా 4.5లక్షల మొక్కల పంపిణీ జరగనున్నదని వాటి ద్వారా రైతులందరూ లబ్ది పొందాలని స్థానిక మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయవరం గ్రామంలో అసిస్ట్ కార్యాలయంలో జరిగిన స్థానిక వాటదారుల సంప్రదింపుల సమావేశంలో అసిస్ట్ డైరెక్టర్ జె రంగారవు మాట్లాడుతూ పండ్లమొక్కల పెంపకం లాభదాయకమని నాలుగు సంవత్సరాలు పోషిస్తే 40సంవత్సరాలు అవి మనకు ఫలాలు అందిస్తుంటాయని పేర్కొన్నారు. వరాహ ప్రాజెక్టు సౌత్ మేనేజర్ డాక్టర్ ఎఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ప్రాజెక్టు యొక్క ఉద్దేశము మరియు లక్ష్యాలు వివరించారు. పండ్లతోటల పెంపం ద్వారా రైతులకు సస్థిర ఆస్థిని నెలకొల్పటంతోపాటు వాతావరణం సమతుల్యానికి తోడ్పడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్ట్ అసోసియేట్ డైరెక్టర్ మూర్తి, డిడిటి రామారావు, రవి, ప్రతినిధి కిరణ్ కుమార్, కందుల, స్థానిక జడ్‌పిటిసి నారు బాపనరెడ్డి, ఏఎంసి ఛైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, మార్కాపురం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కాకర్ల శ్రీనివాసులు, మార్కాపురం అసిస్టి సిబ్బంది, 26గ్రామాలు, 4మండలాల నుండి 230మంది రైతులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవచ్చు

### - గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సవిల్ జడ్జి ఏ ఓంకార్



**గిద్దలూరు, జూలై 5, ప్రభాతవార్త**
లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే విలువైన సమయము, ధనము, వ్యయప్రయాసాలకు లోను కాకుండా సమస్యలను పరిష్కరించుకోవాలసిందిగా గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ ఓంకార్ శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో పిలుపునిచ్చారు. అడిషనల్ జూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కె భరత్ చంద్ర మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులకు రిజిస్టర్ అయిన కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకొని అప్పీలు లేని అవార్డును పొందవలసిందిగా తెలియజేశారు. గిద్దలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పిఎన్ శేషశయనారెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. అనంతరం జరిగిన జాతీయ లోక్ అదాలత్ నందు కేసులను రెండు బెంచీలు ఏర్పాటు చేసి పరిష్కరించడం జరిగింది. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ ఓంకార్, సివిల్ బెంచ్‌కు ప్రెసైడింగ్ ఆఫీసర్‌గా, మెంబర్లుగా ఏ ఆనంద్ కుమార్ మరియు షేక్ ఫాజిల్‌లు వ్యవహరించారు. మెంబర్లుగా మోడి పిచ్చయ్య, వివిఎన్ సుధీర్ కుమార్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూధన్ రావు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు. సివిల్ కేసులు, నగదు వసూలు కేసులు 16, డిక్రీ అమలు కేసులు 9, పార్టీషన్ కేసు 1, స్పెసిఫిక్ ఫర్ ఫామెన్స్ 1, పర్మనెంట్ ఇంజక్షన్ 3, బిఎస్ఎన్ఎల్ కేసులు 10, సివిల్ కేసులు మొత్తం 40, కక్షిదారులకు అందిన మొత్తం 1,07,83154లు. క్రిమినల్ కేసులు ఐపిసి మరియు బిఎన్ఎస్ సెక్షన్ 62కేసులు, ఎక్సైజ్ కేసులు 21, భరణం, గృహహింస కేసులు 10, చెక్ బౌన్స్ కేసులు 3, అడ్మిషన్స్ 118, మొత్తం 214 సివిల్ కేసులు, సివిల్ మరియు క్రిమినల్ కేసులు 254, కక్షిదారులకు మొత్తం రూ.2,06,88,554లు అందించారని తెలిపారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రెండోరోజు ధర్నా



**మార్కాపురం రూరల్, జూలై 5, ప్రభాతవార్త**
ఏపి పిటిడి (ఆర్టీసి) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మార్కాపురం డిపో ఎదుట యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు జనార్దన్ రావు అధ్యక్షతన రెండవ రోజు ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి జోనల్ సహాయ కార్యదర్శి ఎస్‌వి ఎస్ శాస్త్రి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులందరికీ గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలి. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 10వేలమంది సిబ్బంది నియామకాలకు ప్రభుత్వం వెంటనే అనుమతులు ఇవ్వాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ ఏ స్వంతంగా కొనుగోలు చేయాలని, ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ కొరకు దీపోవాలని ప్రైవేటు ఆపరేటర్లకు లీజుకు ఇచ్చే విధానాన్ని విరమించుకోవాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సిబ్బందితోనే నడపాలని ఆర్టీసీ యాజమాన్యానికి మరియు ప్రభుత్వానికి తెలియజేశారు. జిల్లా ఉపాధ్యక్షులు జనార్ధనరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ వెంటనే ప్రకటించాలని, 12వ పిఆర్‌సి కమీషన్ వెంటనే నియమించాలని, ఆర్టీసీ ఉద్యోగులు ఉద్యోగ భద్రతకు సంబంధించిన సర్క్యులర్ నెంబర్ 01/2019 యధావిధిగా అమలు జరిగేలా స్పష్టమైన ఆదేశాలు వెంటనే ఇవ్వాలని, ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లో చేర్చాలని కోరారు. కె ఎంపిఎల్‌పై డ్రైవర్లను వేధించడం మానుకోవాలని, చాలా కాలం నుండి ఒకే సీటులో డిస్పాచ్ మెకానిక్‌ను మరియు కెఎంపిఎల్ మెకానిక్‌ను కొనసాగించడం కరెక్టు కాదని వెంటనే డిపో మేనేజర్ చొరవ తీసుకొని వారిని వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి శేఖర్ నాయుడు, డిపో కార్యదర్శి నాని, ఏపిడి నాగేశ్వరరావు, లాలాను, వైఆర్ ప్రసాద్, సిహెచ్ వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, జాకీర్ హుస్సేన్, శంకరయ్య, గోవిందరెడ్డి, పిఎస్ నాయక్, డ్రైవర్ వలి, గ్యారేజీ అధ్యక్ష కార్యదర్శులు రాజేష్, మోహన్ రావు, కోశాధికారి ఆంజనేయులు, మాజీ గ్యారేజీ కార్యదర్శి ఫ్రాన్సిస్‌లతోపాటుగా అత్యధికమంది పాల్గొన్నారు.

## భీమవరం గ్రామంలో సుపరిపాలన కార్యక్రమం



**ముండ్లమూరు, జూలై 5 ,ప్రభాతవార్త**
మండలంలోని భీమవరం గ్రామంలో తెలుగుదేశం పార్టీ సుపరిపాలన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాజెక్టుల్ని పూర్తి చేయాలన్న అమరావతి రాజధాని పూర్తి కావాలన్నా రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్న కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి తిరిగి ఇప్పటి వరకు ప్రభుత్వం ఏమి చేశారు భవిష్యత్తులో ఇచ్చిన హామీలు ఏమి చేస్తారు అనే అంశాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీ ప్రెసిడెంట్ కంచుమాటి శ్రీనివాసరావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు సుంకర రాఘవరెడ్డి, భీమవరం గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో సుపరిపాలన కార్యక్రమం

### - రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



**దర్శి, జూలై 5 ,ప్రభాతవార్త**
దర్శి టీడీపీ ఇన్‌చార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆదేశాల మేరకు సుపరిపాలనలో భాగంగా తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కావాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్రాన్ని హై టెక్నాలజీతో అభివృద్ధి చెందడానికి సీఎం చంద్రబాబునాయుడు పని చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఏఏ కార్యక్రమాలు ఏ పథకాలు ప్రవేశపెట్టిన వాటి గురించి వివరించి అదే విధంగా భవిష్యత్తులో ఏ కార్యక్రమాలు చేపడతామని అంశాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, మాజీ టౌన్ పార్టీ అధ్యక్షులు యాదగిరి వాసు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు గొర్రె సుబ్బారెడ్డి, సంగా తిరుపతిరావు, అంకయ్య, రామారావు, బేళ్ళ శ్రీను, కొత్తపల్లి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 88 కేసులు పరిష్కారం - ఎస్సై మురళి

**దర్శి, జూలై 5, ప్రభాతవార్త**
మండలంలోని దర్శి టౌన్ పరిధిలోని వివిధ గ్రామాల నుండి వివిధ గ్రామాల నుండి వివిధ కారణాల తోటి కేసులు రాగా వీటిని శనివారం దర్శి కోర్టులో నిర్వహించి లోక్ అదాలత్‌లో 88 కేసులు ని ఇరువైపులా నుండి రాజీతో పరిష్కారం చేయటం జరిగిందని ఎస్సై ఎం.మురళి తెలిపారు. వీటికి జడ్జీలు ఎస్ శివశంకర్, జే.సీతాలు పరిష్కారం చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎవరు గొడవలు పడవద్దు అని క్రమ శిక్షణతో నడవాలని సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

8_8.qxd 7/6/2025 12:35 AM Page 1



## అభయ ఆంజనేయస్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న దారపనేని, వడ్లమూడి



**కనిగిరి, జూలై 5, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గం పామూరు మండలంలో ప్రసిద్ది చెందిన అభయ ఆంజనేయస్వామి (నాయకుడి గుడి) దేవస్థానంలో శనివారం శ్రీ లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్స్ అధినేత వడ్లమూడి నాగేంద్రబాబు కుటుంబ సభ్యులు నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు విఠల కుమారస్వామి సారథ్యంలో దారపనేని చంద్రశేఖర్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు విఠల కుమారస్వామి సారథ్యంలో దారపనేని చంద్రశేఖర్, వడ్లమూడి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకొల్లు అంకయ్య, కాకొల్లు సాయిబాబు, రమణయ్య అండ్ బ్రదర్స్, గొడుగులూరి అంకయ్య(బొట్టు), గోపిచంద్, మాలకొండ రాయుడు, అండ్ బ్రదర్స్ అండ్ సన్స్, మన్నం వెంకట స్వామి కాకర్ల మహేశ్వరరావు, దారపనేని రాజేంద్రప్రసాద్, యరశింగు రాయుడు, మట్లె రాహుల్ యాదవ్, వడ్లమూరి వారి కుటుంబ సభ్యులు, గొడుగులూరి వారి కుటుంబ సభ్యులు, కాకర్ల వారి కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అభయాంజనేయస్వామి కృపకు పాత్రులయ్యారు.

## క్యాన్సర్‌పై అవగాహన.. ఉచిత వైద్య శిబిరం

**- అమరావతిలో హెచ్‌సీజీ ఎంఎన్ఆర్ క్యాన్సర్ హాస్పిటల్**

**- జనని ట్రస్టు సంయుక్త నిర్వహణ**



**కనిగిరి, జూలై 5, ప్రభాతవార్త**

హెచ్‌సీజీ ఎంఎన్ఆర్ క్యాన్సర్ హాస్పిటల్, జనని చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అమరావతి మైదానంలో ఉచిత క్యాన్సర్‌వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసిద్ధ క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ ఆళ్ళ దీప్తి సుమారు 20 మంది ఒగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో తొమ్మిది మందికి క్యాన్సర్ గుర్తించగా, నలుగురిని మెరుగైన చికిత్స కోసం హెచ్‌సీజీ ఎంఎన్ఆర్ క్యాన్సర్ హాస్పిటల్‌కి సిఫార్సు చేశారు. డాక్టర్ దీప్తి మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా ఒంగోలు క్యాన్సర్ సెంటర్‌లో ఉచిత వైద్యం అందుబాటులో ఉందని తెలిపారు. కనిగిరి పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

## జూలై 9 దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**- సయ్యద్ యాసిన్**



**కనిగిరి, జూలై 5, ప్రభాతవార్త**

దేశ వ్యాప్తంగా జూలై 9న జరగనున్న కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటీయుసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్ పిలుపునిచ్చారు. శనివారం కనిగిరిలోని దర్శి చెంచయ్య భవనంలో నిర్వహించిన ఏఐటీయుసీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక, బడుగు, బలహీన వర్గాలకు వ్యతిరేకంగా విధానాలు అమలు చేస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన 4 లేబర్ కోడ్‌లు కార్మికుల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని విమర్శించారు. ఇప్పటి వరకు సాధించిన 8 గంటల పని కాలాన్ని 12 గంటలకు మారుస్తూ, కార్మిక హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు దంతులూరి దీపిక, సంగు శైలజ, భవన నిర్మాణ కార్మిక సంఘ నేత కనమర్ల కృష్ణారెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గంగవరపు కిరణ్, సాల్మన్, స్కూల్ ఆయా వర్కర్స్ యూనియన్ నాయకులు దాసరి సునీత, షేక్ మస్తాన్‌బి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్లేట్లు దానం చేసిన దాతలు

**- దాతల సేవాభావం అభినందనీయం**



**కనిగిరి, జూలై 5, ప్రభాతవార్త**

పాఠశాల అభివృద్దిలో భాగంగా దాతలుగా ముందుకొచ్చిన వ్యక్తులు సేవా దృక్పథం అభినందనీయం అని మోడల్ స్కూల్ ఇన్‌ఛార్జీ హరికృష్ణ అన్నారు. శనివారం మోడల్ విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విశ్రాంత సిండికేట్ బ్యాంకు మేనేజర్ చదలవాడ బాల గురవయ్య, తన తల్లి చదలవాడ కొండమ్మ జ్ఞాపకార్థం 300 స్టీల్ ప్లేట్లను బహుకరించారు. అలాగే కోమటికుంట్ల బాబురావు తన తండ్రి భీమయ్య జ్ఞాపకార్థంగా 100 ప్లేట్లను అందజేశారు. దాతలు మాట్లాడుతూ పాఠశాలలో చదువుతన్న పిల్లలు మేధావులుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలకు ధీటుగా అభివృద్ది చెందుతున్నాయి అని తెలిపారు. ఎస్ఎంసీ చైర్మన్ పందిటి మోహన్ మాట్లాడుతూ అడగగానే విశేషంగా స్పందించి ప్లేట్లు బహుకరించిన దాతలు చదలవాడ బాల గురవయ్య, కోమటికుంట్ల బాబురావు, యాదాల సత్యనారాయణ, అజిత, మేడిద గౌతమ్, యాదాల హరిణి వంటి వారు నిజంగా అభినందనీయం అన్నారు. అనంతరం వారికి శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హృదయ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా ఉచిత పుస్తకాలు పంపిణీ



**వేటపాలెం, జూలై 5, ప్రభాతవార్త**

హృదయ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో బొడ్డు శ్రీనివాసులు ఆర్థిక సహకారంతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సాయి నగర్ పందిళ్ళపల్లి నందు, మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల కొణిజేటి నగర్ బొచ్చులవారిఆపలెం నందు విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాకునుల్ల రమేష్ బాబు మాట్లాడుతూ నోటు పుస్తకాలను వినియోగించుకుని విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి స్థాయిలోకి రావాలని కోరారు. ప్రధానోపాధ్యాయురాలు జీఎస్ వరలక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థులందరూ రోజు పాఠశాలకు వచ్చి చక్కగా చదువుకోవాలని, విద్య అనేది ఎవరు ఎత్తుకుపోలేరని విద్యారత్నం మమాదానం అని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు జి.దిలీప్ కుమార్, అసోసియేషన్ సభ్యులు పింజల సురేంద్ర, పింజల మధుసూదన్‌రావు, బొడ్డు శివయ్య, వైకేవీ సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్న సెయింట్ ఆన్స్ విద్యార్థిని




**వేటపాలెం, జూలై 5 ,ప్రభాతవార్త**

సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చీరాల విద్యార్థిని జేఎన్‌టీయుకే కాకినాడలో 2020-24 బీటెక్ పరీక్షలలో యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానంలో పొంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, శ్రీమంతుల లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ, కాకినాడ వారు శుక్రవారం జరిగిన 11వ స్నాతకోత్సవంలో 2020-24 బీటెక్ పరీక్షల ర్యాంకులలో కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్ విభాగానికి చెందిన షేక్ ఫర్జానా యూనివర్సిటీ స్థాయిలో మొదటి స్థానం పొంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్సలర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్‌ను అందుకోవడం కళాశాలకు గర్వకారణం అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.జగదీష్‌బాబు తెలిపారు. యూనివర్సిటీ పరిధిలో 155 కళాశాలల్లోని విద్యార్థులతో పోటీపడి యూనివర్సిటీ మొదటి ర్యాంకు సాధించి గోల్డ్ మెడల్‌ను అందుకున్న సందర్భంగా ఐటీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఇంద్రనీల్ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్‌కే ఫర్జానా మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం కలుగచేసిన ఆధునిక సాంకేతికత విద్యాబోధన సౌకర్యములు, అత్యంత ఆధునిక లేబరేటరి, లైబ్రరి సౌకర్యాలు యూనివర్సిటీ ర్యాంకు సాధించడానికి దోహదపడినట్లు తెలిపారు. ఎస్‌కే ఫర్జానా గోల్డ్ మెడల్‌ను అందుకున్న సందర్భంగా వివిధ విభాగాధిపతులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

## రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు చంద్రబాబునాయుడుతోనే సాధ్యం

**- రాష్ట్రం అభివృద్ధి చెందాలన్న, సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలన్న పది కాలాల పాటు చంద్రబాబునాయుడే ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజల ఆకాంక్ష**

**- టీడీపీ రాష్ట్ర పరిశీలకులు నాదెండ్ల బ్రహ్మంచౌదరి, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జీ టీడీపీ ఇన్‌చార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు**





**పెద్దదోర్నాల, జూలై 5, ప్రభాతవార్త**

రాష్ట్రం అభివృద్ది బాటలో పయనించాలన్న, సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలన్న పదికాలాల పాటు నారా చంద్రబాబునాయుడే ముఖ్యమంత్రి గా ఉండాలని ప్రజలు ముక్తకంఠంతో ఆకాంక్షిస్తున్నారని టీడీపీ రాష్ట్ర పరిశీలకులు నాదెండ్లబ్రహ్మం చౌదరి, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. సుపరిపాలన తొలి అడుగులో భాగంగా శనివారం పెద్దదోర్నాల అమ్మవారి శాల బజారుకు విచ్చేసిన రాష్ట్ర పరిశీలకులు నాదెండ్ల బ్రహ్మం చౌదరి, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబులకు పెద్దదోర్నాల మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంగళవాయిద్యాలు పూలజల్లులతో ఘన స్వాగతం పలికారు. పసుపు సైన్యంతో కలిసి ఇంటింటికి తిరిగి తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన పథకాలు వివరిస్తూ, ప్రజల అవసరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. మంచి సుపరిపాలన అందిస్తున్న చంద్రబాబునాయుడు పది కాలాల పాటు ముఖ్యమంత్రిగా ఉండాలని, ఏ ఇంటికి వెళ్లిన ప్రజలు సంతోషం వ్యక్త పరచటం ఆశ్చర్యం కలిగించింది. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేశారు. అనంతరం అమ్మవారి శాల బజారులో టీడీపీ మండల కన్వీనర్ ఏరువ మల్లిఖార్జునరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర పరిశీలకులు నాదెండ్ల బ్రహ్మంచౌదరి, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు ప్రతి ఇంటిలో ఆనందసంతోషాలతో ఉన్నారని అన్నారు. నాటి వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, మాస్క్ అడిగినందుకు దళిత డాక్టర్‌ను చంపారని, డ్రైవర్‌ను హత్య చేసి డోర్ డెలివరీ చేశారని, అమరావతి కోసం ఉద్యమించే మహిళామా తల్లులను అవమానపరిచారని, అక్రమ కేసులు పెట్టారని, ప్రజా వేదికను కూల్చారని, అమరావతి రాజధానికి కట్టుబడి ఉంటానని అసెంబ్లీలో చెప్పి అధికారం చేపట్టాక మూడు రాజధానుల డ్రామా ఆడి అభివృద్ధి శూన్యం చేశారని, అందుకే ప్రజలు బుద్ధిచ ఎప్పి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా చేసుకున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల పక్షపాతి అని పది కాలాల పాటు చంద్రబాబునాయుడే ముఖ్యమంత్రిగా కొనసాగాలని, ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం చేసింది చెప్పడం, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని ప్రజలను చైతన్యవంతం చేయటం, గ్రామ కమిటీ, మండల కమిటీ, ప్రతి కార్యకర్త నాయకుల పైన ఉందని వారు తెలిపారు. జగన్ నిరుద్యోగులను మోసం చేశారని, దగా డీఎస్సీ నుండి మెగా డీఎస్సీకి వచ్చామని, జగన్ ప్రభుత్వంలో వృద్దులకు వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్లు పట్టిందని, చంద్రబాబునాయుడు పాలనలో ఒకే సారి వెయ్యి రూపాయలు పెంచి రూ.4వేలు అందజేశారని, వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయకుండానే పూర్తి చేసినట్లు, ప్రారంభించినట్లు ప్రజలకు అంకితం చేస్తున్నట్లు జగన్ డ్రామా నడిపాడని, జగన్ మోసం ప్రజలు తెలుసుకున్నారని, అందుకనే విజన్ ఉన్న చంద్రబాబునాయుడు లాంటి వారే ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఏరువా మల్లిఖార్జునరెడ్డి, గ్రామ సర్పంచ్ చిత్తూరు హారిక, మాజీ సర్పంచ్ హరగోపాల్, ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు షేక్ మాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడి లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు సుధాకర్‌రెడ్డి, బీజేపీ మండల కన్వీనర్ సురవరం గండి వీరారెడ్డి, జనసేన మండల కన్వీనర్ కేతి వెంకట మురళి, టీడీపీ నాయకులు ఈదర మల్లయ్య, ఎస్సీ నాయకులు చంటి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు జంగిలీ పిచ్చయ్య, పబ్బతి సుబ్బారావు, దేసు నాగేంద్రబాబు, షేక్ మౌలాలి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువ వైద్యులపై పోలీసుల దాడి అత్యంత దారుణం

**- ఇన్‌ఛార్జీ దద్దాల**

**కనిగిరి, జూలై 5, ప్రభాతవార్త**

విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసుకొని వచ్చిన విద్యార్థులకు ఏపీ మెడికల్ కౌన్సిల్ పీఆర్ నెంబర్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని వైఎస్సార్‌సీపీ కనిగిరి ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. దీనిపై యువ డాక్టర్లు ప్రభుత్వాన్ని వేడుకున్నా ఫలితం లేదని, పర్మినెంట్ రిజిస్ట్రేషన్ కోసం విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వద్ద శాంతియుతంగా న్యాయపరమైన డిమాండ్స్‌తో నిరసన తెలుపుతున్న యువ డాక్టర్లపై చంద్రబాబు ప్రభుత్వం పోలీసులతో దాడి చేయించడం అత్యంత దారుణమని ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ మండిపడ్డారు. విద్యార్థులపై భౌతిక దాడులు చేయడం అన్యాయమని, విదేశాల్లో చదువుతున్న మెడికల్ గ్రాడ్యుయేట్ విషయంలో ప్రభుత్వం కిరాతకంగా వ్యవహరిస్తుందని అన్ని, అర్హతలు ఉన్న వారికి పీఆర్ నెంబరు ఇస్తే తప్పేంటి, విద్యార్థుల జీవితాలతో ఎందుకు ఆడుకుంటున్నారని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మహిళా వైద్య విద్యార్థులను పోలీసులు జుట్టు పట్టి లాగి అతి దారునంగా రోడ్డుపై ఈడ్చుకెళ్లడం, కాలితో తన్నటం లాంటివి చేయడం దారుణమని అన్నారు. దీనిపై వైద్యశాఖ మంత్రి వెంటనే స్పందించి వైద్య విద్యార్థులకు వెంటనే పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నెంబర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని, ఆరోగ్యశాఖ మంత్రి వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు.

## ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలి

**- కొండపి నియోజకవర్గంలో కొత్త బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి**

**- అధికారులకు మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఆదేశం**



**టంగుటూరు టౌన్, జూలై 5, ప్రభాతవార్త**

కొండపి నియోజకవర్గంలో నూతన బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర సాంఘిక్షసంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఆదేశించారు. శనివారం నాడు ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవ్గ పంచాయతీ ఆజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో విడివిడిగా మంత్రి డాక్టర్ స్వామి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో తాగునీరు, పారిశుధ్యం, రహదారులు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. అవసరమైన చోట కొత్తగా బోర్లు వేయించాలన్నారు. రామతీర్థం నుంచి మర్రిపూడి మండలంలోని పలు గ్రామాలకు తాగునీటి సరఫరాపై అధికారులతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. గ్రామాల్లో పరిశుభ్రత పారిశుధ్యానికి పెద్ద పీట వేయాలని డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో నూతన బీటీరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు.

## పేదల నడ్డి విరిచే విధానాలను వీడండి

**- సీపీఐ నాయకులు అందే**



**మార్కాపురం, జూలై 5, ప్రభాతవార్త**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద మధ్య తరగతి ప్రజల నడ్డి విడిచే విధానాలను వీడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే నారసయ్య అన్నారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని ఆదానితో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఏఓ రవీంద్రారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అందే నాసరయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం తాళం వేస్తుందని, ఈ కారణంగా పేద మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. అయినవాళ్ళకు లాభం చేకూర్చే విధంగా రెండు ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని స్మార్ట్ మీటర్ల ఏర్పాటు లాభ పేక్ష వ్యవహారమేనని పేర్కొన్నారు. ఆదాయానికి లాభం చేకూర్చేందుకు పేద మధ్య తరగతి ప్రజల నడ్డి విడిచేలా స్మార్ట్ మీటర్లను తెరపైకి తీసుకువచ్చారన్నారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ఆర్థిక దోపిడి చేస్తున్నారని నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు ఇలా మోసం చేస్తారా అని ప్రశ్నించారు. ఆధానితో జరిగిన విద్యుత్ ఒప్పందాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ కాశీం సాహెబ్, పట్టణ కార్యదర్శి పెద్దన్న, దుప్పట్ల కాశయ్య, శంకర్, లక్ష్మీ నాయక్, బి.వెంకటేశ్వర్లు, గోపి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మీపద్మావతి వెంకటేశ్వర 18 వ వార్షికోత్సవం





**ముండ్లమూరు, జూలై 5, ప్రభాతవార్త**

మండలంలోని పెద్ద ఉల్లగల్లు గ్రామంలో శ్రీ లక్ష్మీ పద్మావతి వెంకటేశ్వర స్వామి 18వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుండి సాయంత్రంవరకు స్వామివారికి ప్రత్యేకమైన అలంకరణలో వేద పండితులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని దేవుని ఆశీర్వాదాలు అందుకున్నారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. వీటితో పాటు మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని కోలాటాన్ని తిలకించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి నరసింహ శాస్త్రి, ఆలయ నిర్వాహకులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యాయత్నం నుండి మహిళను కాపాడిన ఎస్సై జనార్ధన్



**వేటపాలెం, జూలై 5, ప్రభాతవార్త**

చల్లారెడ్డిపాలెం కొనిజేటి నగర్‌కి చెందిన పొట్లూరి నందిని అనే మహిళ శనివారం నాడు కొత్త కాలువలో పడి ఆత్మహత్య ప్రయత్నం చేస్తుందనే సమాచారం తెలుసుకున్న వేటపాలెం ఎస్సై జనార్ధన్ సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని చేరుకుని సదరు మహిళను ఆత్మహత్య నుండి కాపాడి వివరాలు అడుగగా తన భర్త పొట్లూరి గణపతి అప్పులు చేసి అప్పులు తనను తీర్చమని రోజు తాగొచ్చి కొట్టడం చిత్ర హింసలు పెడుతున్నాడని, తనకి ఇద్దరు సంతానం అని, భర్త వేదింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు వివరణ ఇచ్చింది. అంతట ఎస్సై జనార్ధన్ అన్నింటికి ఆత్మహత్య పరిష్కారం కాదని తన భర్తను అదుపులోకి తీసుకుని విచారించి ఆమెకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆత్మహత్యలు ఎక్కువవుతున్నాయని సమస్యలు ఏమైనా ఉంటే పోలీసు స్టేషన్‌కు వచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు సలహాల ఇచ్చారు.

## పొలాలలో నీటి మోటార్ దొంగలు పట్టివేత



**వేటపాలెం, జూలై5 ,ప్రభాతవార్త**

చల్లారెడ్డిపాలెం గ్రామం కొత్తపాలెంకి చెందిన మర్రి నాగార్జున పొలాలలో నీటి మోటార్లు మాయం అవుతున్నాయని పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం నాడు షేక్ నసీర్ వలి అలియాస్ షన్ను(21)షేక్ సుభాని(21)లను వేటపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుండి సుమారు రూ.1,10,000 విలువ చేసే 5 మెచ్‌పీ మోటార్స్, 3,2హెచ్‌పీ మోటార్స్ రెండు స్వాధీనం చేసుకున్నారు . ముద్దాయిలు చెడు వ్యసనాలకు బానిసలై పొలాలలోని మోటార్స్‌ను దొంగతనం చేసి అమ్ముకొని జల్సాలకు పాల్పడుతున్నట్లు వేటపాలెం ఎస్సై జనార్ధన్ తెలియజేశారు. కేసు నమోదు చేసిన ఎస్సై ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం చీరాల జూనియర్ అడిషనల్ సివిల్ జడ్జి ఎదుట హాజరు పరిచారు.ఈ దర్యాప్తులో ఎస్సైతో పాటు హెడ్ కానిస్టేబుల్ కాశీం, బాజిత్, కానిస్టేబుల్స్ శ్రీనివాసరావు, బలరామయ్య పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపిన నేతలు

**- ఎంపీ మాగుంట, మంత్రి డోలా, ఎమ్మెల్యే దామచర్ల, మాజీ మంత్రులు శిద్ధా, బాలినేని**

**ఒంగోలు, ప్రభాతవార్త**

జిల్లా ప్రజలకు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, బాలినేని శ్రీనివాసరెడ్డిలు శనివారం వేర్వేరు ప్రకటనలో తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ . హిందువుల తొలి పండుగగా ఖ్యాతి చెందిన తొలి ఏకాదశి పండుగకు ప్రత్యేక స్థానముంది. సంవత్సరంలో వచ్చే 24 ఏకాదసులలో ఆషాఢ శుద్ధ ఏకాదశి నాటి నుండి శ్రీ మహావిష్ణువు నాలుగు నెలల పాటు యోగ నిద్రకు క్షీర సాగరంలో శేషతల్పంపై శయనిస్తాడు. ఈ రోజున ఉపవాసం ఉండి, జాగరణ చేసి, శ్రీ మహావిష్ణువును పూజించినచో విశేష ఫలితాలు మనకు కలుగుతాయని పురాణాలు తెలియజేస్తున్నాయి. కనుక జిల్లా ప్రజలందరూ తొలి ఏకాదశి రోజున ఉపవాసం ఉండి, జాగరణ చేసి, శ్రీ మహావిష్ణువును పూజించి విశేష ఫలితాలు పొందాల్సిందిగా కోరారు. తొలి ఏకాదశి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## టంగుటూరు పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ప్రకాశం జిల్లా ఎస్పీ

**- పోలీసుస్టేషన్ పరిసరాలు, రికార్డుల తనిఖీ**

**- పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల తక్షణమే స్పందించాలి**

**- నేర నియంత్రణ, అసాంఘిక చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలి**

**- జిల్లా ఎస్పీ**






**టంగుటూరు టౌన్, జూలై 5, ప్రభాతవార్త**

పోలీసుస్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పనితీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి టంగుటూరు పీఎస్‌ను శనివారం జిల్లా ఎస్పీ ఆకస్మికంగా సందర్శించి పోలీసు స్టేషన్ ఆవరణాన్ని, గదులను, రిసెప్షన్ కౌంటర్, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీసు స్టేషన్‌పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నారని, ఇలానే కొనసాగించాలన్నారు. స్టేషన్ నిర్వహణ రికార్డులు, పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, ఇతర వస్తువులు తనిఖీ చేసి వాటిని త్వరగా డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్ పరిదిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేశారు. పోలీసుస్టేషన్‌లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని వాటిని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే వారి నుండి ఫిర్యాదులు స్వీకరించాలని, వారితో మర్యాదగా, గౌరవంగా నడుచుకోవాలన్నారు. ప్రతి ఫిర్యాదుపై వెంటనే త్వరితగతిన స్పందించి, ప్రాథమిక విచారణను వేగంగా నిర్వహించి బాదితులకు భరోసా కల్పించాలని ఆదేశించారు. ఫిర్యాదుల స్వీకరణ కేసుల నమోదులో ఎలాంటి జాప్యం ఉండవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్లో పని చేస్తున్న సిబ్బంది వివరాలు, వారి విధుల వంటి వాటిపై ఆరా తీశారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. బీట్లు తిరిగే సమయంలో హిస్టరీ షీట్లు కలిగిన వారిని చెక్ చేయాలని, వారి కదలికలపై నిఘా పెట్టాలని, విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. స్టేషన్లో పని చేస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఆకస్మిక తనిఖీలో జిల్లా ఎస్పీ వెంట ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాండురంగారావు, టంగుటూరి ఎస్సై నాగమల్లేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

## గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

**- 7 గోవా మద్యం సీసాలు లభ్యం.. గుర్తు తెలియని వ్యక్తి పరార్..**

**గిద్దలూరు, జూలై 5 ,ప్రభాతవార్త**

అసిస్టెంట్ కమీషనర్ ఎన్ఫోర్స్‌మెంట్ ఒంగోలు వారి ఆదేశాల మేరకు గిద్దలూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం జయరావు, ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్సై డి మౌలాలిలు తమ సిబ్బందితో గిద్దలూరు పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో శనివారం తెల్లవారుజామున దాడులు జరిపినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం జయరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక గుర్తు తెలియని వ్యక్తి మద్యం సీసాలు ఉన్న బాగ్‌ను పడవేసి పరారైనట్లు తెలిపారు. ఆ బ్యాగ్‌లో పరిశీలించగా గోవాకు చెందిన 7మద్యం సీసాలు లభ్యమయ్యాయని వాటిలో 6మద్యం సీసాలు 750మి.లీ, 1మద్యం సీసా 375మి.లీపరిమాణం కలిగి మొత్తం 7 మద్యం సీసాలు ఉన్నట్లు తెలిపారు. నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి పారిపోయిన వ్యక్తి గురించి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ డి మౌలాలి, సిబ్బంది రహంతుల్లా, పి వెంకటేశ్వర్లు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

